క్లుప్తంగా

22న చలో హైదరాబాద్

పాల్వంచ: కేజీబీవీ హాస్టళ్లలో కేజీబీవీ నాన్‌టీచింగ్, వర్కర్లకు వేతనాల పెంపు, ఖాళీ పోస్టుల భర్తీ, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న హైదరాబాద్‌లోని ఎస్‌పీడీ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలని కేజీబీవీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనెల రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కె.భాస్కర్, మీనా కుమారి, లక్ష్మి, అచ్చమ్మ, వెంకటమ్మ, లలిత పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన కల్పించండి..

పాల్వంచరూరల్: మాతశిశు సంరక్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ మాసోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై గ్రామాల్లో సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి జాగృతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా అన్నారు. మండలంలోని పెద్దమ్మగుడి వద్ద బుధవారం ఈనెల 17నుంచి అక్టోబర్ 16 వరకు నిర్వహించనున్న 8వ విడత పోషణ అభియాన్ మాసోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మాతశిశువులకు పోషకాహార లోపాలను నివారించడానికి అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సంపత్, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, సూపర్‌వైజర్ మాధవి పాల్గొన్నారు.

ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు నిర్మిద్దాం..

సింగరేణి(కొత్తగూడెం): సమాజాభివృద్ధికి దోహదపడేలా ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు నిర్మితం కావాలని, శాస్త్రీయ విద్యా విధానం కోసం ఉద్యమించాలని, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిలాల్ అన్నారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలోని ఉర్దూఘర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ మహాసభ రెండోరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జెండాను ఎగురవేశారు. మాట్లాడుతూ సమాజ ప్రగతి ప్రశ్నలోనే దాగి ఉందని, ప్రశ్నించే తత్వం విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని, ఆ సందర్భంలోనే జరిగే ఉద్యమాలు సహజ అభివృద్ధికి తోడ్పాటు అందించేలా ఉండాలన్నారు. అందుకు నాయకత్వం వహించే ఆలోచనలు అలవర్చుకోవాలన్నారు. జే.గణేష్, విజయ్, అరుణ్, రాజేశ్వరి, దీపిక, పల్లవి, జీవన్, రాజేష్, సందీప్, సంతోష్ పాల్గొన్నారు.

వైద్య సమస్యలు పరిష్కరించండి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): వైద్యరంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీవైఎల్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చింత నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి పర్సిక రవి, నోముల భానుచందర్ మాట్లాడారు. ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, సీజనల్ వ్యాధులను నివారించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, ముకుందాపురంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో మోతీలాల్, రావూరి ఉపేందర్, తాటి రమేష్, బానోత్ వినోద్ పాల్గొన్నారు.

వర్కర్ల సమ్మెకు సంఘీభావం

ఇల్లెందురూరల్: హాస్టల్, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాల వద్ద వర్కర్ల సమ్మెకు ఇఫ్టూ నేతలు బుధవారం సంఘీభావం ప్రకటించారు. మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబించడం సరికాదన్నారు. వర్కర్లను పర్మనెంట్ చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రావూరి ఉపేందర్, మోకాళ్ల రమేష్, కొక్కు సారంగపాణి, కొండపల్లి శ్రీనివాస్, బొర్ర రమేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్ఫూర్తితో, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వీరబాబు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుని యువత, విద్యార్థులు తమ జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి జిల్లాకు మంచిపేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రంథాలయ చైర్మన్ వీరబాబు మాట్లాడారు. సీఐలు కరుణాకర్, వెంకటేశ్వర్లు, నాగ సీతారాములు, మద్దెల శివకుమార్, ఉపేందర్, కె.కరుణకుమారి, ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ.1.72 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు

జూలూరుపాడు: తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు అనుగుణంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. లక్ష్యం మంచిదైనప్పటికీ అమలుకు నోచుకోలేదు. పలు గ్రామాల్లో చివరి వీధుల్లోని చివర ఇంటి వరకు తాగునీటి సరఫరా జరగడం లేదు. ఈ పేరుతో చేతి పంపులు, రక్షిత మంచినీటి పథకం డీపీ వ్యవస్థ నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి మూలనపడ్డాయి. వేసవికాలంలో మరింతగా తాగునీటి ఎద్దడి ఏర్పడుతుండటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కారం కోసం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషి ఫలితంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి రూ.1.72 కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేసింది. వీటితో రానున్న వేసవికాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు చేపట్టడంతో వివిధ దశల్లో ఉండగా, వినోభానగర్ ఎస్సీ కాలనీ, పడమటనర్సాపురం కాలనీ, దేస్యాతండా, గాంధీనగర్, రామక్రిష్ణాపురం, జూలూరుపాడు, హరిజనవాడకాలనీ, తదితర గ్రామాల్లో బోర్లు ఏర్పాటు చేశారు. పాపకొల్లులో రూ.30 లక్షలతో 40,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు, బోరు, మోటార్ ఏర్పాటు, వినోభానగర్‌లో రూ.6 లక్షలతో వాటర్ ట్యాంకు, వెంగన్నపాలెంలో రూ.22 లక్షలు, కాకర్లలో రూ.8 లక్షలతో పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నారు. డైరెక్ట్ పంపింగ్ వ్యవస్థ (డీపీ) ద్వారా మిషన్ భగీరథ ట్యాంకులకు అనుసంధానం చేస్తారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎలాంటి సమస్య తలెత్తినా తాగునీటి సరఫరా అంతరాయం ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ పనులు మూడు నెలల్లో పూర్తి చేసే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఇంట్రావిలేజ్ ఏఈ యాస్మిన్‌ను వివరణ కోరగా... తాగునీటి సరఫరాలో తలెత్తిన సమస్య పరిష్కారం అవుతుంది. పలు గ్రామాల్లో బోర్లు వేయడం జరిగింది. మరో మూడు నెలల్లో పనులు పూర్తయేల్యా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా సమస్య ఏర్పడితే తక్షణమే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.



వినోభానగర్‌లో బోరు బావి ఏర్పాటు చేస్తున్న దృశ్యం



గురువాగుతండాలో పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

భగీరథ నీళ్లు రావడం లేదు..



మిషన్ భగీరథ నీళ్లు ఒక్కరోజు వస్తే 15 రోజులు రావు. దీంతో గ్రామంలో తాగునీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఎండాకాలంలో మరింత ఇబ్బందిగా ఉంటుంది. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కృషి ఫలితంగా రెండు రోజుల క్రితం బోరు వేశారు. సమస్య పరిష్కారం అవుతుందని ఆశపడుతున్నాం.

– భట్టు విజయరాజు, చీపురుగూడెం

అలంకారప్రాయంగా ట్యాంకు..



ఆరేళ్ల క్రితం నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు అలంకారప్రాయంగా ఉంది. నిర్మించిన నాటి నుంచి ఒక్కరోజు కూడా మిషన్ భగీరథ నీళ్లు రాలేదు. గ్రామంలో ప్రస్తుతం ఒక డీపీపైనే ఆధారపడుతున్నాం. వేసవికాలంలో వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నాం.

– బానోత్ రాజేష్ కుమార్, దుబ్బతండా

సింగరేణికి ఎస్టీ కమిషన్ నోటీసు

ఇల్లెందురూరల్: జేకే ఓసీ విస్తరణ పనులలో గిరిజన రైతుల నుంచి సాగు భూమి స్వాధీనం విషయంలో సింగరేణి అనుసరిస్తున్న తీరును ప్రశ్నిస్తూ విచారణకు హాజరు కావాలని జాతీయ ఎస్టీ కమిషన్ సింగరేణి ఉన్నతాధికారులకు బుధవారం నోటీసు జారీ చేసింది. మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పూసపల్లి గ్రామ సమీపంలో విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీకి చెందిన గిరిజనులు సర్వే నంబర్ 588/2 పరిధిలో 7.03 ఎకారల విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. సదరు భూమి విషయంలో గతంలో రెవెన్యూ, అటవీశాఖల అధికారులు సాగులో ఉన్న గిరిజనులకు పట్టాల మంజూరు విషయంలో ఒకరిపై మరొకరు నెపం పెట్టుకున్నారు. దీంతో రెవెన్యూ, ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు కాకపోవడంతో ఎటువంటి ఆధారాలు లేకుండానే రైతులు ఇంతకాలం సాగు చేస్తూ వచ్చారు. కానీ జేకే ఓసీ విస్తరణ పనులకు ఏర్పాట్లు చకచకా సాగుతున్న క్రమంలో రెవెన్యూ అధికారులు 7.03 ఎకరాలకు సంబంధించి.. సదరు భూమి మీది అనడానికి సంబంధించిన ఆధారాలు ఉంటే చూపించాలని రైతులకు నోటీసులు జారీ చేశారు. రైతులు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో సదరు భూమిని తమకు అప్పగిస్తూ రెవెన్యూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని సింగరేణి అధికారులు చెబుతున్నారు. దీని ఆధారంగా సింగరేణి అధికారులు సాగులో ఉన్న గిరిజనులను భూమి నుంచి ఖాళీ చేయించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరుతూ మహాశక్తి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాలోత్ దిలీప్ సహకారంతో జాతీయ ఎస్టీ కమిషన్‌ను రైతులు ఆశ్రయించారు. స్పందించిన కమిషన్ ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే విచారణకు హాజరు కావాలని సింగరేణి సీఎండీకి నోటీసులు జారీ చేసింది. తాజా పరిణామంతో సాగులో ఉన్న గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సింగరేణి మనుగడకు ఉద్యమిద్దాం..

ఇల్లెందు: సింగరేణికి పుట్టినిల్లైన ఇల్లెందులో సంస్థ మనుగడకు అన్నివర్గాల ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.సీతారామయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇఫ్టూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటైన ఏరియా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణికి జన్మనిచ్చిన ఇల్లెందును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొందలగడ్డగా మార్చాయని ఆరోపించారు.

బొగ్గు నిల్వలు లేవనే పేరుతో స్థానిక అధికారులు పేరు ప్రతిష్టల కోసం జేకే ఓసీ మూసివేతకు పథకం రూపొందించి కాంట్రాక్టు కార్మికులను తొలగించారని విమర్శించారు. పని కోల్పోయిన కార్మికులు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లెందు మనుగడ కోసం మరోసారి పోరాటాలు నిర్వహించాల్సిన సమయం వచ్చిందన్నారు. దీనికోసం కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ఇల్లెందు వాసులు సిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో రావూరి ఉపేందర్, మోహన్‌రావు, కొండపల్లి శ్రీనివాస్, వరప్రసాద్, పందిర్లపల్లి వీరన్న, చారి, సుధాకర్, నూనేశ్వరరావు, మురళి, పోశం బాబు, మోరె వెంకటేశ్వర్లు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతారామయ్య

సింగరేణిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు



సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రమదానం చేస్తున్న అధికారులు, యూనియన్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి ప్రధాన కార్యాలయం, ప్రధానాస్పత్రిలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంలో ప్రతీఒక్కరు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జలశక్తి మంత్రిత్వ శాఖ, మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల మేరకు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ సూచనలతో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం సింగరేణి వ్యాపితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వయంగా సీఎండీ 20వేల మొక్కలకు పైగా నాటి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సఫాయి కర్మచారీలకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో కూడా పరిసరాలను పరిశుభ్రం చేయాలని, సెప్టెంబర్ 25న ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రమదానం నిర్వహించాలన్నారు. జీఎం (హెచ్‌ఆర్‌డీ), నోడల్ అధికారి టి.వెంకటరామిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో విశిష్ట అతిథిగా డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) ఎం.తిరుమలరావు పాల్గొన్నారు. ఎన్విరాన్‌మెంట్ అడిషనల్ మేనేజర్ ఏ.భాస్కర్‌రావు అధికారులు, డాక్టర్లు, ఉద్యోగులతో స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞను చేయించారు.

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఆస్పత్రిలో ఏరియా జీఎం వి.కృష్ణయ్య ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగులు, సిబ్బంది ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతీరోజు గనులు, డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు పరిశుభ్రత లక్ష్యంగా ఒకగంట సమయం శ్రమదానం చేయాలని సూచించారు. శుభ్రత ఒకరోజు చేపట్టే కార్యక్రమం కాదని, ప్రతీరోజు ఆచరించాల్సిన అలవాటుగా చెప్పారు. ఎస్ఓటూ జీఎం జాకీర్ హుస్సేన్, అధికారులు నర్సింహారావు, రవికుమార్, దిలీప్, మధుబాబు, సతీష్, శ్యాంప్రసాద్, అజయ్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ డిపో మేనేజర్



రాజ్యలక్ష్మికి స్వాగతం పలుకుతున్న ఆర్టీసీ అధికారులు

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సత్తుపల్లి నుంచి వచ్చిన రాజ్యలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల సాధారణ బదిలీలలో భాగంగా పలువురు డిపో మేనేజర్లను యాజమాన్యం బదిలీ చేయగా ఇక్కడ పని చేసిన డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్‌ను వనపర్తికి బదిలీ చేశారు. రాజ్యలక్ష్మిని పలువురు ఆర్టీసీ అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

టేకులపల్లి: మండల కేంద్రం సేవాఘడ్‌లోని జగదాంబ దేవీ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆలయ చైర్మన్ భూక్యా గన్యా నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, భక్తుల సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు.

తక్కువ లాభాలు చూపితే సహించం..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ గతేడాది మాదిరిగా, ఈసారి కూడా లాభాలు తక్కువ చేసి చూపిస్తే సహించేది లేదని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని టీబీజీకేఎస్ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరం అంకెల గారెడీతో రూ.4,701 కోట్ల నికర లాభంలో 33శాతం వాటా ఇస్తామని ప్రకటించిన యాజమాన్యం రూ.2,412 కోట్లను మాత్రమే చూపించి వాటిలో 33శాతం పంచి కార్మికులను శ్రమ దోపిడీ చేశారని ఆరోపించారు. గత సంవత్సరం ఆడిట్ షీట్‌ను ఇప్పటి వరకు విడుదల చేయలేదని, ఇప్పటికైనా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులకు అన్యాయం జరగకుండా దసరాలోపు 35 శాతం లాభాల వాటా అందించాలని, లేదంటే 22న సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గడప రాజయ్య, వసికర్ల కిరణ్, మురలి, బోరింగ్ శంకర్, ఈశ్వర్, అరుణ్, అశోక్ కుమార్, వెంకటేశ్, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి శిక్షణతో ఆర్థికంగా ఎదగాలి



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మహిళలు ఆర్థికంగా ఎదగాలని సింగరేణి కార్పొరేట్ ఏరియా సేవా సమితి ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సింగరేణి కార్పొరేట్ డీజీఎం (పర్సనల్) కేసా నారాయణ అన్నారు. 2024–25 సంవత్సరానికి సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ తదితర వృత్తి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సింగరేణి ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పరీక్షలను పర్యవేక్షించారు. మాట్లాడుతూ సింగరేణి సామాజిక బాధ్యతగా సింగరేణి గృహిణులతో పాటు పరిసర ప్రాంత నిరుద్యోగ మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని సంస్థ వ్యాపితంగా ఎన్నో వృత్తివిద్యా కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తాము నేర్చుకున్న వృత్తి శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి యూనిట్లను నెలకొల్పుకుని తమతో పాటు మరికొంత మందికి జీవనోపాధి కల్పించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఖాదీ గ్రామోద్ మహా విద్యాలయ వారి నుంచి అందజేసే ధృవీకరణ పత్రం ద్వారా దాదాపు అన్ని బ్యాంకుల నుంచి రుణం పొందవచ్చని వివరించారు. అనంతరం వివిధ కోర్సులలో శిక్షణ పొందిన 324 మంది మహిళలకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



జూలూరుపాడు: నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: సృష్టికర్త విశ్వకర్మ జయంతిని జూలూరుపాడులో బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి, జెండా ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు యలబాక వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చేతి వృత్తులు వారు సంఘటితమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సున్నం కృష్ణామాచారి, తిప్పర్తి శివ, యలబాక వెంకటేశ్వర్లు, ముత్తాచారి, సున్నం ప్రసాద్, సున్నం శేఖరాచారి, సున్నం వెంకటేశ్వర్లు, కాసర్ల మంగయ్యచారి, నరసింహాచారి, వీరభద్రాచారి, చంద్రగిరి రమేష్, సత్యనారాయణ, వెంకటరమణ, శ్రీను, బంగారు పాండురంగాచారి, కాసర్ల అనంతాచారి, సాయికుమార్, శంకరాచారి, వీరాచారి పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రపంచపు తొలి వాస్తు శిల్పి సృష్టికర్తగా పేరొందిన విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను టేకులపల్లి మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. వక్తలు మాట్లాడుతూ... సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప, కంచరి వంటి వివిధ వృత్తులను సృష్టించారని తెలిపారు. తాడోజు భిక్షమయ్య, ధర్మపురి శ్రీనివాసాచారి, చంద్రగిరి రాధాకృష్ణ, వజ్రాల పరిపూర్ణాచారి, బొడ్డుపల్లి బ్రహ్మాచారి, పర్వతపు ఉపేంద్రాచారి, కటుకోజ్వల సురేష్, ఉరిమెళ్ల యాదాచారి పాల్గొన్నారు.

జెండా ఎగురవేసి సంబురాలు

కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో సెప్టెంబర్ 17వ తేదీ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, డివిజన్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సింగరేణి, కేటీపీఎస్‌లో జెండాలను ఎగరేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో..



ఇల్లెందు: జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కమిషనర్ శ్రీకాంత్



సుజాతనగర్ తహసీల్‌లో జాతీయ జెండా ఎగరేస్తున్న అధికారులు



సింగరేణి(కొత్తగూడెం): మాట్లాడుతున్న సింగరేణి జీఎం శాలేంరాజు



సూపర్‌బజార్(కొత్తగూడెం): అమరులకు నివాళులర్పిస్తున్న నాయకులు



పాల్వంచ: జెండా ఆవిష్కరిస్తున్న సాయిబాబా



జూలూరుపాడు సొసైటీ కార్యాలయంలో ...



టేకులపల్లి: బద్దుతండాలో మాట్లాడుతున్న ఎన్డీ నాయకుడు వెంకటేశ్వర్లు



ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో



పాల్వంచరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో..



ఇల్లెందు: తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ పుట్టిన రోజును బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వాస్పత్రిలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రోగులకు పండ్లు, పాలు పంచిపెట్టారు. అమ్మ పేరుతో మొక్కలు నాటారు.

– సాక్షి నెట్‌వర్క్



చుంచుపల్లి: రక్తదానం చేస్తున్న నాయకులు



పాల్వంచరూరల్: ఏరియా ఆస్పత్రిలో బ్రెడ్, పండ్లు అందజేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు